



PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్








నల్లగొండ | హైదరాబాద్ | రంగారెడ్డి | epaper.arjunsaamaachaaram.com | మంగళవారం 23, జూన్ 2026 | సంపుటి :1 సంచిక : 174 | పేజీలు : 8 , వెల.2.00




# 30 నెలల్లో వినాశనం..

- చీకటిని చూస్తేనే వెలుగుకు విలువ
- ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభం
- పంటల కొనుగోలు విషయంలో డ్రామాలు
- రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే
- 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు...
- సీఎం రేవంత్ నోరు తెరిస్తే బూతుల బురద
- ఢిల్లీ చేతుల్లో పాలన పెడితే నష్టం
- మాజీ మంత్రి కేటీఆర్

2 లో

బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను చూసుకుంటే... కాంగ్రెస్ నేతలు పెద్దలను చూసుకుంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మడికొండలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్, సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణలో రాజకీయం దిగజారిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చెప్పిన అబద్దాలను నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభమని విమర్శించారు.



2 లో..



## తెలంగాణ అభివృద్ధిపై కీలక చర్చలు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం

## కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో

# సీఎం రేవంత్ భేటీ..

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఈరోజు (సోమవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి తెలిపారు రేవంత్‌రెడ్డి. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం.



## బ్రిటన్ ప్రధాని పదవికి రాజీనామా ప్రకటించిన కీర్ స్టార్మర్

యూకేలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని పదవి నుంచి తాను తప్పుకుంటున్నట్టు కీర్ స్టార్మర్ ప్రకటించారు. లేబర్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి కూడా తప్పుకుంటున్నానని పేర్కొన్నారు. రాజీనామా కోసం పార్టీ నుంచి ఒత్తిడి పెరగడంతో కీర్ స్టార్మర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

2



## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. వర్చువల్‌గా కోర్టుకు అల్లు అర్జున్ హాజరు

## తెలంగాణ హక్కుల

# పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(=ఙూ), తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు.

2





## భూపాలపల్లిలో దారుణం.. టిప్పర్ ఢీకొట్టడంతో ఆర్టీవో మృతి

వార్త 2లో

# సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి

## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



2

సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపిం చారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు.

# దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ టూరిజం శాఖ

చరిత్ర కలిగిన పురాతన భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం తీసుకొస్తామని టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈరోజు(సోమవారం) ఉదయం భువనగిరి ఖిల్లా పైకి రోప్ వే నిర్మించే స్థలాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫోర్ట్ రిస్టోరేషన్ చేసి చరిత్ర తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. గంటకు మూడు వందల మంది ప్రయాణికులు ఖిల్లా పైకి వెళ్లేలా రోప్ వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట , భువనగిరి ఖిల్లా, కొలనుపాక సోమేశ్వర ఆలయం, స్వర్ణగిరిలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.

2



# కేటీఆర్ సినిమా డైలాగులు మానుకోవాలి.. ప్రజల కోణంలో మాట్లాడాలి: ఎంపీ చామల

2

తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో పోతున్నారని వ్యాఖ్యానించారు.



# 30 నెలల్లో వినాశనం..

## చీకటిని చూస్తేనే వెలుగుకు విలువ

## ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభం

## పంటల కొనుగోలు విషయంలో రేవంత్ రెడ్డి డ్రామాలు

## రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే

## 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు...

## సీఎం రేవంత్ నోరు తెరిస్తే బూతుల బురద

## ఢిల్లీ చేతుల్లో పాలన పెడితే నష్టం

## మాజీ మంత్రి కేటీఆర్

హనుమకొండ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలను చూసుకుంటే... కాంగ్రెస్ నేతలు పెద్దలను చూసుకుంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మడికొండలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్, సోషల్ మీడియా శిక్షణా తరగతుల కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణలో రాజకీయం దిగజారిపోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలను నమ్మి.. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టంకట్టారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సంక్షోభమని విమర్శించారు. రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని.. పంటల కొనుగోలు విషయంలో రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు అయ్యిందని... అయినా ప్రజల మమకారం పోలేదని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా గులాబీ జెండా రెపరెపలే కనిపిస్తున్నాయన్నారు. 'అధికారం ఎవరికీ శాశ్వతం కాదు... అధికారం మనకు మాత్రమే సొత్తు అనుకోవద్దు. ప్రజలకు మేలు చేస్తారేమో అని ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు' అని చెప్పారు. దేశం మొత్తం కాంగ్రెస్ అనే దరిద్రాన్ని వదిలించుకుందని.. కానీ 420 హామీలు ఇవ్వడంతో తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. బాండ్ పేపర్లు ఇచ్చి, పథకాల వరద పారిస్తామన్నారని తెలిపారు. సీఎం రేవంత్ నోరు తెరిస్తే బూతుల బురద తప్ప... అభివృద్ధి ఏమీ లేదని మండిపడ్డారు. కండలు తిరిగిన ఉస్తాదు అయినా మూడు నెలల్లోనే పిల్లలను పుట్టిస్తారా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. మూడు నెలల్లోనే పిల్లలు పుట్టరని తెలుసని, కానీ 30 నెలల్లో పుట్టకపోతే ఏమనాలని ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి పాలనలో బూతుల మోతలు, పచ్చి అబద్ధాలు తప్ప ఏమీ లేవని మాజీ మంత్రి విమర్శించారు. ఢిల్లీ చేతుల్లో పాలన పెడితే నష్టం తప్పదని మొదటినుంచీ చెబుతున్నామని అన్నారు. వంద సార్లు ఢిల్లీకి పోయిన సీఎం రేవంత్.. రాష్ట్రానికి వంద పైసలైనా తెచ్చారా అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే.. డబ్బుల సంచులన్నీ ఢిల్లీకి పంపిస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు ఎగొట్టి, యూరియా కోసం లైన్‌లలో నిలబడే పరిస్థితికి రైతులను తీసుకొచ్చారన్నారు. 30 నెలల్లో వినాశనం జరిగిందని.. చీకటిని చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# బ్రిటన్ ప్రధాని పదవికి రాజీనామా ప్రకటించిన కీర్ స్టార్మర్


ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

యూకేలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని పదవి నుంచి తాను తప్పుకుంటున్నట్టు కీర్ స్టార్మర్ ప్రకటించారు. లేబర్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి కూడా తప్పుకుంటున్నానని పేర్కొన్నారు. రాజీనామా కోసం పార్టీ నుంచి ఒత్తిడి పెరగడంతో కీర్ స్టార్మర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.స్టార్మర్ నాయకత్వంపై లేబర్ పార్టీలో కొంత కాలంగా అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఆయన సారథ్యంలో ప్రభుత్వ పాప్యులారిటీ తగ్గుతోందన్న ఆందోళన పార్టీ వర్గాల్లో నెలకొంది. ప్రజాసేవలను మెరుగు పరుస్తానంటూ కీర్ స్టార్మర్ 2024లో ప్రధాని బాధ్యతలు చేపట్టారు. జీవన వ్యయాలు తగ్గిస్తానని ప్రజలకు మాటిచ్చి గద్దెనెక్కారు. ఆర్థిక అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. అయితే, హామీల మేరకు ఫలితాలు లేకపోవడంతో ప్రజల్లో విముఖత పెరగడంపై లేబర్ పార్టీలో ఆందోళన వ్యక్తం అవుతోంది.ఈ నేపథ్యంలో లేబర్ పార్టీకి చెందిన మరో నేత ఆండీ బర్న్‌హామ్ రూపంలో కీర్ స్టార్మర్ నాయకత్వానికి సవాలు ఎదురైంది. గతంలో గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌గా ఉన్న ఆయన కీర్ స్టార్మర్‌పై ఇటీవల కాలంలో తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికలో ఘన విజయం సాధించారు. స్టార్మర్ నాయకత్వానికి సవాలు విసురుతూ పార్లమెంటులో కాలుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో స్టార్మర్ తప్పుకోవాలన్న ఒత్తిడి పార్టీలో పెరగడంతో ఆయన రాజీనామాను ప్రకటించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.లేబర్ పార్టీతో పాటు కన్జర్వేటివ్ పార్టీపై కూడా యూకే ప్రజల్లో విముఖత వ్యక్తం అవుతోందని స్థానిక మీడియా చెబుతోంది. దీంతో, రైజింగ్ రీఫార్మ్ పార్టీ, గ్రీన్ పార్టీ వంటి ప్రత్యామ్నాయాలకు ప్రజాదరణ అంతకంతకూ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో తమ పట్టును నిలుపుకునేందుకు అధికార లేబర్ పార్టీ దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగానే ప్రధాని కీర్ స్టార్మర్ తప్పుకోవాల్సి వచ్చిందని అక్కడి విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు.

# సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. వర్చువల్‌గా కోర్టుకు అల్లు అర్జున్ హాజరు

హైదరాబాద్,

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో నాంపల్లి కోర్టు విచారణకు హీరో అల్లు అర్జున్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకు నాంపల్లి కోర్టు అనుమతివ్వడంతో ముంబై నుంచి వర్చువల్‌గా అల్లు అర్జున్ అటెండ్ అయ్యారు. ఈ కేసులో మిగిలిన నిందితులు వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఏ 11 గా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. ఈరోజు(సోమవారం) ఉదయం సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ వ్యక్తిగతంగా కోర్టు ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంది.సినిమా షూటింగ్‌ల కారణంగా అర్జున్ ముంబైలో ఉన్నారని, అక్కడి నుంచి వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫున న్యాయవాది మెమో దాఖలు చేయగా.. అందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో ఈరోజు మధ్యాహ్నం నాంపల్లి కోర్టు ముందు అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా హాజరయ్యారు. దీన్ని కూడా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసు తదుపరి విచారణను నాంపల్లి కోర్టు జులై 6కు వాయిదా వేసింది. ఆరోజు కూడా కోర్టుకు అల్లు అర్జున్ వ్యక్తిగతంగా హాజరుకానున్నారా లేక వర్చువల్‌గానే అటెండ్ అవుతారా అనేది చూడాల్సి ఉంది.



# కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ..

## తెలంగాణ అభివృద్ధిపై

## కీలక చర్చలు

## రాజ్‌నాథ్ సింగ్‌కు..

## సీఎం కృతజ్ఞతలు

## యుటిలిటీస్ బదలాయింపు వంటి

## అంశాల్లో పూర్తి సహకారం

ఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఈరోజు (సోమవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి తెలిపారు రేవంత్‌రెడ్డి. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివి ధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా



కార్గో, ఎమార్వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరారు ముఖ్యమంత్రి. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు సీఎం. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

# తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: మంత్రి ఉత్తమ్ కుమార్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(=ఖా), తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఉత్తమ్ సూచించారు. కృష్ణా పరివాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. తెలంగాణ రైతుల హక్కులు, సాగునీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హనుమకొండ,

సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారుప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళు న్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# భూపాలపల్లిలో దారుణం.. టిప్పర్ ఢీకొట్టడంతో ఆర్టీవో మృతి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా,

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండలం చెల్పూరులో వాహనాల తనిఖీలు చేస్తున్న సమయంలో ఆర్టీవో వెంకన్నపై లారీ దూసుకెళ్లడంతో మృతిచెందారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఏం జరిగిందంటే.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెల్పూరులోని ఆర్టీవో కార్యాలయం ఎదుట ఆర్టీవో వెంకన్న వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో తాడిచర్లలోని ఎంఏఆర్ఎల్‌కు సంబంధించిన టిప్పర్‌ను ఆపే ప్రయత్నం చేయగా, డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని ముందుకు నడిపాడు. దీంతో టిప్పర్ నేరుగా వెంకన్నను ఢీకొట్టి, ఆయనపై నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన వెంకన్నను స్థానికులు, సహచరులు వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే ఆస్పత్రికి చేరుకునేలోపే ఆయన మృతి చెందారు. ఈ టిప్పర్ ఓనర్ పెద్దపల్లి ఏరియాకి చెందిన ఖలీల్‌ఖాన్‌గా పోలీసులు గుర్తించారు.

# దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ టూరిజం శాఖ: మంత్రి జూపల్లి కృష్ణారావు

యాదాద్రి, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

చరిత్ర కలిగిన పురాతన భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం తీసుకొస్తామని టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈరోజు(సోమవారం) ఉదయం భువనగిరి ఖిల్లా పైకి రోప్ వే నిర్మించే స్థలాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫోర్ట్ రిస్టోరేషన్ చేసి చరిత్ర తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. గంటకు మూడు వందల మంది ప్రయాణికులు ఖిల్లా పైకి వెళ్లేలా రోప్ వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.యాదగిరిగుట్ట , భువనగిరి ఖిల్లా, కొలనుపాక సోమేశ్వర ఆలయం, స్వర్ణగిరిలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన టూరిజం శాఖను దేశంలో నంబర్ వన్‌గా గుర్తింపు తీసుకొస్తామని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో చారిత్రక కట్టడాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి వందలాది మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. నెలకు రెండు రోజులైనా టూరిజానికి సమయం కేటాయించాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యాటక స్థలాలకు వెళ్తే ప్రజల ఆలోచనా విధానం మారుతుందని... అనేక మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.


# కేటీఆర్ సినిమా డైలాగులు మానుకోవాలి.. ప్రజల కోణంలో మాట్లాడాలి: ఎంపీ చామల

భువనగిరి,

తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఈరోజు (సోమవారం) భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

## బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా..?

ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాలాగా కనపడుతున్నాయా..? అని కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా...? అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని



చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేంద్రప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు.

## హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు..

మెట్రోఫేజ్– 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రోఫేజ్ –2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రోఫేజ్–2పై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రోఫేజ్ –2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా...? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. బీజేపీ ఓటు, సీటు చోరీల గురించి కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ఫైర్ అయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

### బాలలహక్కుల పరిరక్షణ కమిటీ కృషి చేయాలి

### సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క సూచన

**హైదరాబాద్,**

తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో



మిషన్ వాత్సల్య మరియు సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు మరియు పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మంత్రి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున వాటిని నివారించాలన్నారు. శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సమావేశంలో పాల్గొని, మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి సంబంధించిన విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎన్. మోతి జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారులు , జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, అలాగే తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు మర్రిపల్లి చందన, బండి అపర్ణ గారు, కంచర్ల వందన గౌడ్ గారు, ప్రేమలత అగర్వాల్, గోగుల సరిత బుర్కా వచన్ కుమార్ పాల్గొన్నారు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

### యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్

### ఉండవల్లి గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ

### బాబాతో కలిసి ఆసనాలు వేసిన చంద్రబాబు

### చంద్రబాబు విజినరీ నేత అన్న బాబా రాందేవ్

**అమరావతి**

దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా ప్రక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం

సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత



సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని అన్నారు. అమరావతి కోసం 29 వేల

మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

# హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

### లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం

### హైడ్రాపై దుష్ప్రచారం తగదు

### మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్,**

హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడ్డుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని



ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

# తెలంగాణ సాధనే శ్వాసగా జీవించిన సార్

హైదరాబాద్, : తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర స్వాప్నికులు ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి త్యాగాన్ని, కృషిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా ఆయన జీవితాన్ని గడిపారని గుర్తు చేసుకున్నారు. ఆ మహనీయుడి త్యాగాన్ని తెలంగాణ సమాజం, ప్రజా ప్రభుత్వం సదా గుర్తుంచుకుంటుందని తెలిపారు. ఆ మహనీయుడి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు కోసం ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

### మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్

### ఖంగుతిన ఎటిఎకు సమాచారం ఇచ్చిన విద్యార్థి

### పొరపాటును సవరించి, కొత్త కేంద్రం అలాట్‌కు హామీ

**న్యూఢిల్లీ,**

నీట్ రీ-ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పూర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష




కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో రద్దయిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను నేడు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందే. రీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.

# హైదరాబాద్‌లో రోడ్డుకు ట్రంప్ పేరు సరికాదు

### ఒక నియంత పేరు పెట్టడం ఎంతవరకు సబబు

### సిఎం రేవంత్ నిర్ణయాన్ని తప్పుపట్టిన సిపిఎం

**న్యూఢిల్లీ,**

హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పక్కన ఉన్న రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి తీవ్రంగా వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వియత్నాంపై అమెరికా యుద్ధం ఉధృతంగా సాగుతున్న సమయంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట నేత హో చి మిన్ గౌరవార్థం కోల్‌కతాలోని అమెరికా రాయబార కార్యాలయం వెలుపల ఉన్న హారింగ్టన్ వీధికి ఆయన పేరు పెట్టారని ఈ సందర్భంగా బేబి గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాలంలో అమెరికా.. ఇరాన్‌పై యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం, వెనిజులాలో సైనిక జోక్యానికి పాల్పడటం, క్యూబాపై ఆంక్షలతో దౌర్జన్యం చేయడం వంటి చర్యల ద్వారా మానవాళిపై సామ్రాజ్యవాద దురాక్రమణకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన విమర్శించారు. నేటి కాలపు హిట్లర్‌లా మారాలని ఆకాంక్షిస్తున్న ట్రంప్‌ను గౌరవిస్తూ, తెలంగాణ ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కన ఉన్న రహదారికి ఆయన పేరు పెట్టాలని నిర్ణయించడం సరికాదని దుయ్యబట్టారు. ఇటీవల అమెరికా సైన్యం ఒక నిరాయుధ వాణిజ్య నౌకపై దాడి చేసి ముగ్గురు భారతీయ నావికులను హతమార్చిందని ఆయన ఆరోపించారు. అమెరికా ప్రభుత్వం ఇటువంటి దాడులను కొనసాగిస్తామని బెదిరిస్తున్నప్పటికీ, ఈ దారుణమైన క్షిపణి దాడిపై భారత ప్రభుత్వం తగిన రీతిలో నిరసన వ్యక్తం చేయలేదని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ విషయంపై స్పందించడానికి నిరాకరించారని అన్నారు. దీన్నిబట్టి దేశ సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని వదులుకోవడానికి బిజెపికి ఎటువంటి సంకోచం లేదని స్పష్టమవుతోందని, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఈ వివాదాస్పద నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా కాంగ్రెస్ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకోవాలని తాను ఆశిస్తున్నట్లు ఎం.ఎ. బేబి పేర్కొన్నారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ చేసే తీర్మానాలు కేవలం మాటలకే పరిమితం కాకూడదని, ఆచరణలో చూపాలని ఆయన సూచించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సిరిసిల**

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషాకు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, 60 ఏళ్లు నిండిన కార్మికులకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. అలాగే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. జూన్ 18, 19 తేదీల్లో మున్సిపల్ కార్యాలయాల ముందు, జూన్ 22న కలెక్టర్ కార్యాలయం వద్ద, జూన్ 30న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు కోడం రమణ, కాసర్ల శంకర్,లు పిలుపునిచ్చారు.

PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## పశ్చిమాసియాలో శాంతికి అవాంతరం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సమసిపోతాయనుకున్న తరుణంలో అమెరికాఇరాన్ మధ్య శుక్రవారం స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. దీంతో తాత్కాలిక కాల్పుల విరమణ భవిష్యత్తుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా మధ్య పోరాటం ఉధృతం కావడం, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో 16 మంది ప్రాణాలు కోల్పోవడంతో చర్చలకు తాత్కాలికంగా దూరంగా ఉండాలని ఇరాన్ నిర్ణయించుకుంది. చర్చలను తిరిగి ప్రారంభించే ముందు లెబనాన్‌పై దాడులు ముగిసిపోతాయని హామీ కావాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య జరిగిన అవగాహన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ వ్యతిరేకిస్తోంది. అమెరికా ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందంపై సంతకాలు జరగడంతో ఇరాన్ నౌకల రాకపోకలపై విధించిన దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తివేయడం మంచి పరిణామం. ఇరాన్ అణుసామర్థ్యాన్ని పూర్తిగా నిలిపివేయడం, ప్రాంతీయ దాడులను ఆపడం వంటి ట్రంప్ లక్ష్యాలు పూర్తిగా సాధ్యం కాకపోయినప్పటికీ, ఆర్థిక సడలింపులు, ఇరాన్ పునర్నిర్మాణ నిధులు వంటి అంశాలు ఉండటం చర్చలకు కొత్త మలుపు ఇచ్చాయి. అమెరికా ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం కుదరడం ప్రపంచానికి ఎన్నో పాఠాలు నేర్పింది. సైనిక బలంతో ఏకపక్షంగా ఆధిపత్యం చెలాయించడం కంటే ఇంధన సంక్షోభ నివారణ, దౌత్యచర్చలు, పరస్పర రాజీలే అంతర్జాతీయంగా సుస్థిరతను కాపాడతాయని ఈ ఒప్పందం నిరూపించింది. హర్మూజ్ జలసంధి మూతపడినప్పుడు ముడిచమురు కోసం ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ, అత్యవసర నిల్వలను సిద్ధంగా ఉంచుకోవడం ఎంత అవసరమో ప్రపంచ దేశాలు గ్రహించాయి. అత్యంత ఆధునిక సైనిక సాంకేతికత ఉన్నప్పటికీ, ఇరాన్ వంటి దేశాలు తక్కువ ఖర్చుకలగిన డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించి దీర్ఘకాలికంగా ప్రపంచాన్ని ఇబ్బందులపాలు చేయగలవని ప్రపంచానికి అర్థమైంది. అమెరికా వంటి అగ్రరాజ్యాలు ఒంటెత్తుపోకడకు పోకుండా ప్రాంతీయ భాగస్వామ్య దేశాల సహకారం తీసుకోవాలని, మధ్యవర్తిత్వం, దౌత్యపరమైన చర్చలు తదితర ప్రయత్నాలను నమ్ముకుంటేనే ఎక్కువ ప్రయోజనం పొందగలవని స్పష్టమైంది. అమెరికా ఇరాన్ మధ్య శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం ఒక్కటే సరిపోదు. ఒకపక్షంపై ఒత్తిడి తెచ్చి ఒప్పించే, భరోసా ఇచ్చే, నిబంధనలను నిర్ణయించే సత్తా ఉంటేనే సత్ఫలితాలు లభిస్తాయి. బుధవారం కాల్పుల విరమణ ఒప్పందం వెనుక కేవలం దౌత్యపరమైన శాంతి చర్చలే కాకుండా వ్యూహాత్మక ఒత్తిళ్లు ఉన్నాయి. దౌత్యవేత్తలు కేవలం శాంతి వచనాలతో చర్చలకు రాలేదు. ఇరాన్‌పై విధించిన ఆంక్షలు ఎత్తివేయడం, ఇరాన్ తీరాలపై అమెరికా నావికా దిగ్బంధనం తొలగించడం, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించడం వంటివి ఈ ఒప్పందంలో ప్రధాన భూమిక పోషించాయి. రెడ్‌బుక్ రాజ్యాంగమా వర్ధిల్లు! ఇరాన్ పునర్నిర్మాణానికి అమెరికా అందించే 300 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం ప్రతిపాదన ఈ ఒప్పందంలో ముఖ్యమైంది. దౌత్యవేత్తలు ఇరు వర్గాలు ఒత్తిడికి గురికాకుండా ఆర్భాటంగా ప్రకటనలు చేయకుండా, చర్చల సమాచారం బహిర్గతం కాకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ఒప్పందం అంతర్జాతీయ దౌత్యంలో ఒక కొత్త మార్పును సూచిస్తుంది. ఇది అంతిమ గొప్ప ఒప్పందం కాదు. కానీ ఓ తాత్కాలిక అవగాహన. ఇది అరవై రోజుల చర్చలకు అవకాశం కల్పించింది. అయితే ఇందులో పరిష్కారం కాని అనేక ప్రశ్నలు కనిపిస్తున్నాయి. అసలు యుద్ధానికి మూల కారణమైన ఇరాన్ వద్ద ఉన్న సుమారు 440 కిలోల అధిక సుసంపన్నమైన (60%) యురేనియం సంగతి ఏమైంది? స్తంభించిన ఇరాన్ ఆస్తులు ఎంతవరకు విడుదల అవుతున్నాయి?

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

## భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు

**ఇస్లామాబాద్,**

సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించుకోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. ాగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

## అమెరికాకు షాకిచ్చిన చైనా

**బీజింగ్,**

:అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర–మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్న ట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.

## మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

**మాస్కో,**


రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

# సమాచారం సినిమా CINEMA



## బాలకృష్ణ మూవీలో కాజల్ అగర్వాల్

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌డికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శుక్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ–గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. 'భగవంత్ కేసరి'లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 'ఎన్‌బికె111'లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.



## పవర్‌ఫుల్ రోల్‌లో సమంత

మూడేళ్ల విరామం తర్వాత సమంత చేసిన సినిమా 'మా ఇంటి బంగారం'. దాంతో ఈ సినిమాపై అంచనాలు మొదట్నుంచీ భారీగానే ఉన్నాయి. పైగా 'ఓ బేబీ' తర్వాత నందినీరెడ్డి, సమంత కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినిమాపై ఆసక్తి జనాల్లో మెండుగానే ఉన్నది. ఈ సినిమాలో సమంత తొలిసారి యాక్షన్ రోల్ పోషించారు. ప్రచార చిత్రాలకూ, పాటలకు కూడా మంచి స్పందన రావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ వివాహం చేసుకొని, ఓ సంప్రదాయ కుటుంబంలోకి పెద్ద కోడలుగా ఎంట్రీ ఇస్తుంది స్వర్ణ(సమంత). ఇంట్లోకి వచ్చిన నాటి నుంచి అప్పటికే ఇంట్లో ఉన్న చిన్నకోడలు అనసూయ(శ్రీముఖి)తో పోలుస్తూ అంతా ఆమెను చూస్తుంటారు. అనసూయ ఇంటిని చక్కదిద్దటంలో దిట్ట. కానీ స్వర్ణకు మాత్రం ఆ ఇంటి విషయాలు ఏమీ తెలియవు. కానీ ఎలాగైనా పెద్ద కోడలుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెడుతుంది. దీనికి తన చిన్ననాటి స్నేహితురాలు ఆమెకు సహాయం చేస్తుంటుంది. ఈ విధంగా సరదాగా కథ సాగుతూవుంటుంది. మరోవైపు నక్సలైట్ ముసుగులో దుర్మార్గాలకు తెగబడే నీచుడైన గుల్షన్ దేవయ్య జైల్లో శిక్ష అనుభవిస్తుంటాడు. తనకు అనుచరుడి ద్వారా తన సహ నక్సలైట్ అయిన ఝాన్సీ ఆచూకీ తెలుస్తుంది. ఆ ఝాన్సీనే స్వర్ణగా పేరు మార్చుకొని బతుకుతున్నదని తెలుసుకున్న గుల్షన్ దేవయ్య, ఎలాగైనా ఝాన్సీని దక్కించుకునేందుకు జైలు నుంచి పారిపోయి వస్తాడు. ఝాన్సీ వేరే వ్యక్తిని పెళ్లాడిందని తెలుసుకొని రగిలిపోతాడు. ఎలాగైనా ఝాన్సీని, ఆమె కుటుంబాన్నీ నాశనం చేయాలనుకుంటాడు. మరి స్వర్ణ రూపంలో ఉన్న ఝాన్సీ తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నది? అసలు స్వర్ణలా ఝాన్సీ ఎందుకు మారింది? ఈ స్వర్ణ ఎవరు? ఆమె కథేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ. కొంచెం రొటీన్ కథే అయినా 'మా ఇంటి బంగారం' విషయంలో కొత్తగా కనిపించిన విషయం ఏంటంటే.. ఇది లేడీ ఓరియెంటెడ్ స్జబెక్ట్ కావడమే. ఈ తరహా కథ ఓ హీరోయిన్ చేయడం మాత్రం కొత్తగా ఉన్నది. ఫస్టాఫ్ సినిమా చూస్తున్నంతసేపూ మహేశ్‌బాబు 'అతడు' సినిమా గుర్తొస్తుంది.

## సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి

అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి. ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు, థ్రిల్లింగ్ సీన్లను నెక్ట్స్ లెవెల్‌కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించారు. ప్రతాప్ ఆర్. కృష్ణా సినిమాటోగ్రఫీ మైండ్ బ్లోయింగ్ అనిపించేలా ఉంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి.

## నాగారంలో వాడుక నీటి సమస్యకు పరిష్కారం




**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

కమాన్‌పూర్ మండలంలోని నాగారం గ్రామంలో వాడుక నీటి సమస్యకు పరిష్కారం కల్పించినట్లు సర్పంచ్ పొన్నగంటి కుమార్ తెలిపారు. గ్రామంలోని స్మశాన వాటిక, ధోబీఘాట్, నర్సరీలకు ఒకే బావి ద్వారా నీటి సరఫరా జరుగుతుండగా, ఇటీవల వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడంతో బావిలో నీటి కొరత ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో బావిలో పేరుకుపోయిన పూడికను తొలగించి మరమ్మతులు చేపట్టడంతో నీటి సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీంతో గత కొన్ని రోజులుగా నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న రజకులకు, నర్సరీ మొక్కలకు అవసరమైన నీరు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వడ్నాల శ్రీనివాస్, గడ్డి సతీష్, బొంకూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల లక్ష్యం: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే పోలీసుల లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా సీపీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఆపదలో ఉన్న వారికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి పలు ఫిర్యాదులు అందగా, వాటిపై వెంటనే స్పందించిన పోలీస్ కమిషనర్ సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చట్ట పరిధిలో ఉన్న ప్రతి ఫిర్యాదుపై ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదుల విషయంలో అత్యంత సున్నితంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అర్జున్ సమాచారం కథనంతో స్పందించిన పోలీసులు....

### లక్కారంలో గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహణ

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22: ఇటీవల అర్జున్ సమాచారంలో ప్రచురితమైన "లక్కారంలో గంజాయి కలకలం" కథనానికి స్పందించిన పోలీసులు



సోమవారం లక్కారం గ్రామంలో గంజాయి, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్‌ఐ రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ యువత, విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సరదాగా ప్రారంభించే మత్తు పదార్థాల అలవాటు వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తుందని, యువత ఇలాంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా గంజాయి విక్రయాలు, వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌ఐ రవి కుమార్ కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు, యువత, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలోని రైతులకు భూమిపై చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఒ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సోమవారం నాడు రెవెన్యూ ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక టెలికాన్ఫ్రెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో ఇప్పటివరకు ఆరు లక్షల మంది దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వివరించగా, మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లోగా నోటీసుల జారీ ప్రక్రియను పూర్తిగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఆ తర్వాత నిర్దేశిత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా ఒక ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం




సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దరఖాస్తులు స్వీకరించినప్పటికీ 2020 ఆర్ఓఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు పడ్డారని విమర్శించిన మంత్రి, ప్రస్తుత ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని వెల్లడించారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు కేవలం ఏడాది కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల కొత్త పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందేలా పారదర్శక, వేగవంతమైన వ్యవస్థను రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఐదు మండలాల్లో అమలు చేస్తున్నామని, అక్కడ పరిస్థితులు విజయవంతంగా ఉన్నట్లు అధికారులు తెలపడంతో, త్వరలోనే రెండో దశలో భాగంగా ప్రతి జిల్లాకు ఒక మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

# ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా, రైతులకు ఒకే వేదికపై నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈనెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,601 రైతు వేదికలలో ప్రత్యేక విత్తన మేళాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. ప్రస్తుత వాతావరణ మార్పులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. రైతులు తమ అవసరాలకు తగినట్లుగా ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను సరసమైన ధరలకే కొనుగోలు చేసేందుకు వ్యవసాయ శాఖ అన్ని ప్రాంతాల్లో విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ విత్తన మేళాల్లో పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాల విత్తనాలతో పాటు నువ్వులు, వేరుశెనగ వంటి నూనెగింజల పంటల విత్తనాలు, వివిధ రకాల చిరుధాన్యాలు, కూరగాయల విత్తనాలను రైతులకు పెద్ద ఎత్తున అందుబాటులో ఉంచుతున్నారు. వీటితో పాటు మార్కెట్ డిమాండ్, రైతుల అభిరుచులను దృష్టిలో ఉంచుకొని బీపీటీ--5204, ఆర్‌ఎన్‌ఆర్--15048 (తెలంగాణ సోనా), జైశ్రీరామ్,



కేఎన్‌ఎం--1638, కేఎన్‌ఎం --7715, డబ్ల్యూజీఎల్--44, హెచ్‌ఎంటీ సోనా వంటి ఏడు రకాల ప్రముఖ సన్న వరి రకాల విత్తనాలను కూడా ఇక్కడ విక్రయించనున్నారు. అలాగే సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా విప్లవాత్మక మార్పులు తెచ్చిన నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువులను సైతం ఈ మేళాల్లో రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. కేవలం విత్తనాల విక్రయమే కాకుండా, ఈ మేళాల సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉండి ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. ఎల్‌నినో పరిస్థితులను తట్టుకుని నిలబడే ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, విత్తన శుద్ధి పద్ధతులు, సమగ్ర పంట యాజమాన్యం, ఎరువుల సరైన వినియోగం, నీటి యాజమాన్యంతో పాటు చీడపీడల నివారణ వంటి పలు కీలక అంశాలపై రైతులకు తగిన మార్గదర్శకత్వం వహించనున్నారు. నాణ్యమైన విత్తనమే అధిక దిగుబడికి పునాది అనే నినాదంతో ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను కొనుగోలు చేసి శాస్త్రీయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐఏఎస్ ఈ సందర్భంగా కోరారు.

# సిద్దిపేటలో ఘనంగా టీఆర్‌ఎస్ జెండా పండుగ: ఒకేరోజు ఐదు ప్రాంతాల్లో ఎగిరిన పార్టీ జెండా

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సిద్ధిపేట నియోజకవర్గంలో జెండా పండుగ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఒకేరోజు నియోజకవర్గ పరిధిలోని ఐదు వేర్వేరు ప్రాంతాల్లో టీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. సిద్ధిపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పరిశీలకుడు లోక రవిచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెండా పండుగ నియోజకవర్గ పరిశీలకుడు కంచర్ల శివారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జీలు చల్లారం మల్లారెడ్డి, గ్యాదరి గిరి, పట్టణ నాయకులు మహ్మద్ గౌస్ మియా, అశోక్, నిరంజన్, కమలాకర్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకుడు కంచర్ల శివారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అమరుల ఆశయాల సాధన కోసమే కల్వకుంట్ల కవిత టీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని లక్ష్యాన్ని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, మెరుగైన వైద్యం అందించడమే పార్టీ ముఖ్య ఆశయమని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం ఆధారంగా తెలంగాణ నిర్మాణాన్ని సాధించడం కోసం తెలంగాణవాదులంతా ఏకతాటిపైకి వచ్చి కవితమ్మకు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఒకేరోజు ఐదు ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణల పరంపరలో భాగంగా సిద్ధిపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీతో పాటు గంగాపూర్, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమాల సందర్భంగా పలువురు ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పార్టీ విధానాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ రాష్ట్ర పరిశీలకుడు లోక రవిచంద్ర, కంచర్ల శివారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం గ్రామస్థాయిలో మరిన్ని విస్తృత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పార్టీ ప్రతినిధులు స్పష్టం చేశారు.



## నేటి నుండి 'విత్తన మేళా'.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ఏఓ అత్తె సుధాకర్

**అర్జున్ సమాచారం, భీమారం(మంచిర్యాల) , జూన్ 22:**



రానున్న వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని భీమారం మండలంలోని రైతులకు నాణ్యమైన వరి మరియు ఇతర విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక విత్తన మేళాలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విత్తన మేళాలు జూన్ 23 నుండి 30 వరకు (ఎనిమిది రోజుల పాటు) భీమారం మండల కేంద్రంలోని 'రైతు వేదిక' లో నిరంతరాయంగా కొనసాగుతాయని పేర్కొన్నారు.ప్రభుత్వం బోనస్‌కు ఎంపిక చేసిన ఏడు వరి రకాలైన =చీ= 15048, ధీూ 5204, ఖచీవీ 1638, ఎమీ సోనా, జై శ్రీరామ్, ఔ+ూ 44 మరియు ఖచీవీ 7715 విత్తనాలను పాటు నానో డిఏపి మరియు యూరియాను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. ఈ కార్యక్రమంలో విత్తన కంపెనీలు, విత్తన డిస్ట్రిబ్యూటర్లు, విత్తన డీలర్లు మరియు ప్రభుత్వ అనుబంధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్న డీలర్లు పాల్గొని రైతులకు అవసరమైన సమాచారం అందించనున్నారు.విత్తనాల ఎంపిక, సాగు కాలం, దిగుబడి సామర్థ్యం, మార్కెట్ అవకాశాలు తదితర అంశాలపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన సంస్థల ప్రతినిధులు అవగాహన కల్పిస్తారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా సరైన రకాన్ని ఎంపిక చేసుకునేందుకు ఈ విత్తన మేళాలు ఉపయోగపడతాయి.రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, తమ భూములకు మరియు అవసరాలకు అనుగుణంగా సరైన విత్తన రకాలను ఎంపిక చేసుకునేందుకు ఈ మేళా ఒక మంచి అవకాశం. కావున భీమారం మండలంలోని రైతాంగం పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు.

## ఫోన్ ద్వారా ప్రజా సమస్యల స్వీకరణ

**అర్జున్ సమాచారం జూన్ 22 మంచిర్యాల జిల్లా ప్రతినిధి:**



చెన్నూరు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు, వినతులు, అభ్యర్థనలను నేరుగా శాసనసభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామికి తెలియజేసే అవకాశం కల్పించారు.జూన్ 23వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు 9490700870 దూరవాణి సంఖ్యకు కాల్ చేసి శాసనసభ్యునితో మాట్లాడవచ్చు.ప్రజలు నిర్దేశించిన తేదీ, సమయాల్లో మాత్రమే సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

## బూరుగుపల్లి పాఠశాలలో యోగా దినోత్సవం:



**అర్జున్ సమాచారం, భీమారం(మంచిర్యాల) , జూన్ 22:**

మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల-బూరుగుపల్లి లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు రకాల యోగాసనాలు వేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏలే విజయ్ కుమార్, ఆర్మీ ఆఫీసర్ దేనవేని పున్నం మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్యం యోగా సాధన చేయడం వల్ల ఏకాగ్రత, శారీరక దృఢత్వం పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోతనపల్లి ఉపాధ్యాయుడు మహేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతన్నలకు నీరు అందేలా తూముల మరమ్మతులు చేపట్టాలి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22**

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ఊర చెరువు తూములో చెత్తాచెదారం, సిమెంట్ బస్తాల్లో ఇసుక, పాత గుడ్డ సంచులు, రాళ్లు, రప్పలు పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చెరువుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైతుల కథనం ప్రకారం, ఏడాది క్రితమే ఈ సమస్యపై ఇరిగేషన్ శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. తూమును పూర్తిగా శుభ్రం చేయకపోవడం, దెబ్బతిన్న భాగాలకు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల సాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని వాపోతున్నారు.ప్రస్తుతం తూములో చెత్తాచెదారం, రాళ్లు, పాత సంచులు పేరుకుపోవడంతో వర్షాకాలంలో నీటి ప్రవాహం మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తూమును పూర్తిగా శుభ్రపరచడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.





# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి.. హానికరమైన విషయాలకు ధైర్యంగా 'నో' చెప్పండి: డీసీపీ ఎ. భాస్కర్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, జీవితాన్ని నాశనం చేసే హానికరమైన విషయాలకు ధైర్యంగా "నో" చెప్పే అలవాటు పెంపొందించుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై రూపొందించిన చిత్రాలను పరిశీలించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం, పోలీస్ శాఖ విద్యార్థుల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పిస్తోందని తెలిపారు. డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొంతమంది యువత తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు పడతాయని, చిన్న ఆసక్తితో సిగరెట్ లేదా ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం క్రమంగా వ్యసనంగా మారి నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవిత విలువలను బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు





తెలియజేయాలని, అవసరమైతే డయల్-100 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. మంచి పౌరులుగా ఎదిగి మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా అప్రమత్తం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్ఐ సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల సేవల కోసమే లయన్స్ క్లబ్ పనిచేయాలి: డాక్టర్ విజయ



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

పేద ప్రజల సేవే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని, సమాజ సేవలో ప్రతి సభ్యుడు ముందుండాలని లయన్స్ క్లబ్ ఫాస్ట్ గవర్నర్ డాక్టర్ విజయ అన్నారు. సోమవారం కమాన్‌పూర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ అధ్యక్షుడిగా సాన రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి శంకర్, కోశాధికారిగా డాక్టర్ విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ విజయ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.లయన్స్ ఇంటర్నేషనల్ పేద వర్గాల అభ్యున్నతి, సేవా కార్యక్రమాలకే అంకితమై పనిచేస్తోందని ఆమె పేర్కొన్నారు. కరోనా కాలంతో పాటు పలు విపత్తుల సమయంలో కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సభ్యులకు సూచించారు.కార్యక్రమంలో రీజినల్ చైర్‌పర్సన్ సోమారపు లావణ్య, జోనల్ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీవాణి, లయన్స్ క్లబ్ సభ్యులు చౌడవరపు లింగమూర్తి, బొజ్జ రాజసాగర్, సోప్పరి సంతోష్ కుమార్, జబ్బార్ ఖాన్, బండసాయి శంకర్, లగీచెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## పీరీల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

కమాన్‌పూర్ అంగడి బజార్‌లోని పీరీల మసీదు వద్ద సోమవారం మొహరం ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.మొహరం సందర్భంగా పది రోజులపాటు మసీదు వద్ద ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం పీరీల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శాంతి, సౌభాగ్యాల కోసం ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మచ్చ అనిల్, మచ్చ రాజయ్య, ముజావర్ ఎస్.కె. రఫీక్, మొహరం కమిటీ సభ్యులు పలిగిరి సత్తయ్య, ఎస్.కె. ఫహీం, నారగోని సరిత, నీలం మధుకర్, సందీప్, పవన్, అజయ్, శ్రీను, పరుశురాం, సాయి, వెంకటేశం, నాగరాజు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి: ఎస్సై తాడవేని శ్రీనివాస్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**




రామగిరి మండలంలోని బేగంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.డ్రగ్స్ వల్ల విద్యార్థుల బంగారు భవిష్యత్తు దెబ్బతింటుందని, వ్యసనానికి గురైతే ఆరోగ్యం క్షీణించడమే కాకుండా చట్టపరమైన కేసుల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే కుటుంబ, సామాజిక సంబంధాలపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు.విద్యాసంస్థల్లో డ్రగ్స్ ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరదాగా ప్రారంభించే డ్రగ్స్ అలవాటు వ్యసనంగా మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని పేర్కొన్నారు. సమాజంపై డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై తాడవేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్




**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనపై దృష్టి సారించాలని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ అన్నారు. సోమవారం కమాన్‌పూర్ మండలం గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి యువతే దేశ భవిష్యత్తని, డ్రగ్స్ క్షణిక ఆనందాన్ని కలిగించినప్పటికీ వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చదువుపై ఆసక్తి తగ్గి భవిష్యత్తు అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు.విద్యార్థులు సోషల్ మీడియా, చెడు స్నేహాల ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా డ్రగ్స్ వినియోగాన్ని ప్రోత్సహించే వారిని గమనిస్తే వెంటనే అధ్యాపకులు, తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని క్రీడలు, పుస్తక పఠనం, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఖలీల్ ఖాన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకోవాలని, సమస్యలు ఎదురైనప్పుడు మాదకద్రవ్యాల వైపు మళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఖలీల్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుళ్లు దాసి సతీష్, శ్రీనాథ్, జాహ్నవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జైపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జైపూర్ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీ ముందుగా రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ ఉన్న బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే చట్టపరిధిలో విచారణ జరిపి తగిన చర్యలు




తీసుకోవాలని ఎస్ఐ భూమేష్‌కు సూచించారు.అనంతరం రిసెప్షన్ రికార్డులను పరిశీలించి వాటి నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు, వారికి కేటాయించిన బాధ్యతలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై సేకరిస్తున్న సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తుగా తీసుకుంటున్న చర్యలపై ఎస్ఐతో సమీక్ష నిర్వహించారు. అలాగే శాఖాపరమైన సమస్యలు ఏమైనా ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకుని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
సినిమా
CINEMA



# రామ్ పోతినేని-భాగ్యశ్రీ బోర్సే నిజంగా ప్రేమలో ఉన్నారా..

సినీ పరిశ్రమలో హీరో హీరోయిన్ల మధ్య స్నేహం, ప్రేమ, పెళ్లి వార్తలు ఎప్పుడూ ఆసక్తికర చర్చలకు దారి తీస్తుంటాయి. కొన్నిసార్లు ఇవి కేవలం పుకార్లుగానే మిగిలిపోతే, మరికొన్ని సందర్భాల్లో నిజమై వివాహ బంధంగా మారుతుంటాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఇలాంటి మరో లవ్ స్టోరీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ప్రేమలో ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన భాగ్యశ్రీ బోర్సే, తన అందం, గ్లామర్‌తో యువతను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఆమె రామ్ పోతినేని సరసన 'ఆంధ్రా కింగ్' చిత్రంలో నటించే అవకాశం దక్కించుకుంది. ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా, షూటింగ్ సమయంలోనే రామ్-భాగ్యశ్రీ మధ్య మంచి స్నేహం ఏర్పడిందని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరిగింది. ఆ స్నేహమే క్రమంగా ప్రేమగా మారిందనే వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల తన తాజా చిత్రం 'లెనిన్' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ టాక్ షోలో భాగ్యశ్రీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరింత చర్చనీయాంశంగా మారాయి. నా మొదటి ఇల్లు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ అయితే, హైదరాబాద్ నా రెండో ఇల్లు. అది ఇప్పటికే ఫిక్స్ అయిపోయింది అని ఆమె చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని పలువురు నెటిజన్లు, అభిమానులు భాగ్యశ్రీ త్వరలో తెలుగింటి కోడలిగా మారబోతుందా? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. కొందరు అభిమానులు అయితే రామ్‌తో ఆమె సంబంధం నిజమేనని సోషల్ మీడియాలో పోస్టులు కూడా చేస్తున్నారు.






## అనిల్ రావిపూడిని ఓ
# ఆటాడుకున్న హీరోలు..

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న మల్టీస్టారర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన ఓ వినూత్న ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హాస్యం, సరదా సంభాషణలు, ఆసక్తికరమైన కథా సూచనలతో రూపొందించిన ఈ వీడియో సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. ఆదివారం విడుదలైన ఈ ప్రత్యేక వీడియోలో వెంకటేష్, కళ్యాణ్ రామ్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ మధ్య సరదా సంభాషణలు కనిపించాయి. పాపం అనిల్‌ను ఇసుకలో పాతేశారట అంటూ వెంకటేష్ సరదాగా మాట్లాడగా, కళ్యాణ్ రామ్ కూడా "పటాస్ సమయంలో బాగానే ఉన్నాడు.. కానీ 'నేను పాడతా' అని మీరే ఇలా చేశారంటూ" నవ్వులు పూయించారు.



# 3డీ ఫార్మాట్‌లో హను-మాన్

యువ హీరో తేజ సజ్జా కథానాయకుడిగా, ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన 'హను-మాన్' చిత్రం పానిండియా స్థాయిలో సాధించిన విజయం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 2024లో విడుదలై దేశవ్యాప్తంగా రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లను రాబట్టిన ఈ చిత్రాన్ని ఈ నెల 25న 3డీ ఫార్మాట్‌లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌కి హీరో సాయిదుర్గతేజ్ అతిథిగా విచ్చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప ఇలాంటి సినిమా దొరకదని, ఇలాంటి సినిమాలో నటించే అవకాశం రావడమే అదృష్టమని హీరో తేజ సజ్జా అన్నారు. ఇంకా నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, హీరోయిన్ అమృత అయ్యర్, సంగీత దర్శకుడు గౌర హర, 3డీ కిరణ్ కూడా మాట్లాడారు.

# రొమాంటిక్‌గా రాజా ది రాజా

రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'రాజా ది రాజా'. అనిల్ బోయిడపు దర్శకుడు. కె.నిహారిక దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కె.శ్రీలతారెడ్డి సమర్పిస్తున్నారు. జూలై 17న సినిమా విడుదల కానున్నది. ప్రతిష్టాత్మక మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ కలర్‌ఫుల్ విజువల్స్‌తో రొమాంటిక్ మూడ్‌ని ప్రజెంట్ చేస్తున్నది. డా.నరేష్ విజయకృష్ణ, సాయికుమార్, అవసరాల శ్రీనివాస్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవికిరణ్ బోయిడపు, సంగీతం: మార్క్ కె.రాబిన్, నిర్మాణం: బృందావన్ క్రియేషన్స్.



# రూరల్ 'లవ్ జాతర'

అంకిత్ కొయ్య, మానస చౌదరి జంటగా నటిస్తున్న రూరల్ లవ్‌స్టోరీ 'లవ్ జాతర'. గోపీనాథ్‌రెడ్డి దర్శకుడు. కంకణాల ప్రవీణ నిర్మాత. హీరో అంకిత్ కొయ్య పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ సినిమాలో ఆయన పోషిస్తున్న త్రివిక్రమ్ పాత్రను పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. కొత్త హెయిర్‌స్టైల్‌తో, క్యాజువల్ వేర్‌లో క్యూరియస్‌గా కనిపిస్తున్న అంకిత్‌ను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఈ చిత్రానికి కెమెరా: సుజాత సిద్ధార్థ్, సంగీతం: చేతన్ భరద్వాజ్.

# నాతో నేను గడిపేందుకే ఈ నిర్ణయం

యువతలో మంచి క్రేజ్ ఉన్న కథానాయికల్లో కయాదు లోహర్ ఒకరు. ప్రస్తుతం తెలుగు, తమిళ సినిమాలతో ఈ అందాలభామ బిజీబిజీగా ఉన్నది. తాజాగా ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాకు కొన్నాళ్లు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని జత చేసింది. 'సోషల్‌మీడియా నుంచి ఒక అడుగు వెనక్కి వేస్తున్నాను. శరీరం మాదిరిగానే మనసుకు కూడా విశ్రాంతి అవసరం. నాతో నేను ఎక్కువగా గడిపేందుకు తీసుకున్న నిర్ణయం ఇది. ఇప్పటిదాకా సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదాలు.





## యోగా దినోత్సవం సందర్భంగా



**అరుజున్ సమాచారం జూన్ 21జగిత్యాల ప్రతినిధి::**

యోగాభ్యాసంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం . యోగ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగను భాగం చేసుకోవాలీ....ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ వేడుకల్లో జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ , జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ , మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వైద్యులు, సిబ్బందితో కలిసి యోగా ఆసనాలు నిర్వహించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, యోగాభ్యాసంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని అన్నారు. యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ఎంతో ఉపయుక్తమని, యువత ఆరోగ్య పరిరక్షణకు యోగాభ్యాసం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, ఐవీసా సుజాత,డిప్యూటీ ఎవ్ట్రశీ శ్రీనివాస్,ముకేష్ ఖన్నా,సాయి, ఆయుష్ సిబ్బంది, మెడికల్ కాలేజీ అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధుల ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## క్యాతన్‌పల్లిలో శ్రీ మారుతి శక్తి వ్యాయామశాల ప్రారంభం:



**సమాచారం జూన్ 22 మంచిర్యాల.ప్రఅర్జున్తినిధి:**

మంచిర్యాల జిల్లా, క్యాతన్‌పల్లి:క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని 9వ వార్డులో ఆర్‌కేపీ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మారుతి శక్తి వ్యాయామశాలను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంలో వ్యాయామానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. శారీరక దృఢత్వం పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంలో వ్యాయామశాలలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. యువత వ్యాయామం, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యాయామశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల కోరికకు వెంటనే స్పందన!

### పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ చొరవతో క్రీడా సామగ్రి పంపిణీ

**సమాచారం జూన్ 22 మంచిర్యాల.ప్రఅర్జున్తినిధి:**

మంచిర్యాల, జూన్ 22:మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలను ఇటీవల సందర్శించిన పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడారు. ఆ సందర్భంగా తమకు క్రీడా సామగ్రి అందించాలని విద్యార్థులు ఆయనను కోరారు. విద్యార్థుల విజ్ఞప్తిని వెంటనే స్వీకరించిన పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ వారి కోరిక నెరవేర్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన కృషితో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు గడ్డం వంశీకృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని పలువురు ప్రశంసించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తూ విద్యార్థుల ప్రతిభ వికాసానికి తోడ్పడుతున్న ఆయన సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. క్రీడా సామగ్రి అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణకు, మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.



# జైపూర్‌కు మరో అభివృద్ధి వరం -- నూతన సామాజిక భవనానికి శంకుస్థాపన

**అర్జున్ సమాచారం జూన్ 02 మంచిర్యాల జిల్లా ప్రతినిధి:**

జైపూర్ మండల కేంద్రంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సామాజిక భవనానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి సోమవారం భూమిపూజ నిర్వహించారు. సంస్థల సామాజిక బాధ్యత నిధుల ద్వారా చేపడుతున్న ఈ నిర్మాణం గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇటువంటి భవనాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళు న్నట్లు చెప్పారు. భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ భవనం ద్వారా సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా అవసరాలకు సంబంధించిన అనేక కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6,545 కేసుల పరిష్కారం..

### బాధితులకు రూ.73.67 లక్షల రీఫండ్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూన్ 20న నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 6,545 కేసులను విజయవంతంగా పరిష్కరించినట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన దర్యాప్తు, కోర్టు విచారణలో ఉన్న కాంపౌండబుల్ కేసుల్లో 637 ఐపీసీ కేసులు, 46 ప్రత్యేక చట్టాల (ఎస్ఎల్ఎల్) కేసులు పరిష్కరించగా, 3,097 ఈ–పెట్టి కేసులు, 2,809 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, విపత్తు నిర్వహణ చట్టానికి సంబంధించిన రెండు ఈ–పెట్టి కేసులను కూడా పరిష్కరించారు. అదే సందర్భంగా 83 సైబర్ నేర కేసుల్లో బాధితులకు మొత్తం రూ.73,67,714 తిరిగి అందజేశారు. ఇందులో కమిషనరేట్ పరిధిలోని 76 కేసుల్లో రూ.27,35,072, సీసీపీఎస్ రామగుండం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఏడు కేసుల్లో రూ.46,32,647 బాధితులకు రీఫండ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పెట్టి కేసులు, ట్రాఫిక్, ఎక్సైజ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర స్వల్ప చట్టపరమైన కేసులు వేగంగా పరిష్కారమవడంతో ప్రజలకు సమయం, ధనం ఆదా అయ్యాయని ఆయన పేర్కొన్నారు. గత 15 రోజులుగా పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది కేసుల్లోని పక్షాలను స్వయంగా కలిసి రాజీ మార్గంపై అవగాహన కల్పించడంతో నిర్దేశించిన లక్ష్యానికి మించి కేసులు పరిష్కరించగలిగామని తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన కమిషనరేట్ అధికారులు, సిబ్బందిని కమిషనర్ అభినందించారు. ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించి విశేషంగా కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి త్వరలో రివార్డులు అందజేస్తామని తెలిపారు. అలాగే రెండు జోన్ల ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవా సంస్థలకు పోలీస్ శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## ధైర్యంగా ఉండండి.. మీకు అండగా షీ టీమ్స్ ఉన్నాయి: ఎస్ఐ ఉషారాణి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, వారికి అండగా, రక్షణగా షీ టీమ్స్ ఎల్లప్పుడూ ఉంటాయని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ పర్యవేక్షణలో సోమవారం మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ టౌన్‌షిప్‌లో



సింగరేణి పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది మాట్లాడుతూ తెల్లవారుజాము నుంచే విధులకు వెళ్లే మహిళా పారిశుధ్య కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు చట్టపరంగా కల్పించిన హక్కులు, వేధింపుల నుంచి రక్షణ పొందే మార్గాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, షీ టీమ్స్ విధులు, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–100, రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మహిళలు ఎటువంటి వేధింపులకు గురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి, కాంట్రాక్టర్ గోపాలరావు, సూపర్‌వైజర్ రఘు, సింగరేణి పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


## పోలీస్ డ్యూటీ మీట్‌తో నైపుణ్యం, సామర్థ్యం మెరుగుపడతాయి: సీపీ అంబర్ కిషోర్ ఝా





**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూన్ 22:**

పోలీసు అధికారుల వృత్తిపరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపరచడంలో పోలీస్ డ్యూటీ మీట్ కీలక పాత్ర పోషిస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కమిషనరేట్ స్థాయి మూడవ పోలీస్ డ్యూటీ మీట్--2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన అధికారులు, సిబ్బందికి కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, పేలుడు పదార్థాల గుర్తింపు, యాంటీ–సబోటేజ్ తనిఖీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుందని చెప్పారు. శాస్త్రీయ దర్యాప్తు, వేలిముద్రల విశ్లేషణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సంక్లిష్ట కేసుల దర్యాప్తులో మెళకువలు, పరస్పర అనుభవాల మార్పిడి వంటి అంశాల్లో ఈ డ్యూటీ మీట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పాల్గొనే అధికారులు తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి కాళేశ్వరం జోన్, రాష్ట్ర స్థాయిలో రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్, ఏఓ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.